# గెలుపెవరిది?

"గుడ్ న్యూస్. మీరు తండ్రి కాబోతున్నారు?" తెల్లటి మల్లెపూవు ల్లాంటి బట్టలతో ఉన్న లేడి డాక్టర్ లక్ష్మి స్ప్రింగు తలుపు తెరచుకుని వస్తూ అంది. అక్కడే వరండాలో కుర్చీలో కూర్చుని పరధ్యానంగా బయటకు చూస్తున్న శ్రీధర్ లక్ష్మి రాకతో లేచి నిలబడ్డాడు.

"మీరు తండ్రి కాబోతున్నారు!" అతను పరధ్యానంగా ఉన్నాడని కనిపెట్టిన లక్ష్మి నవ్వుతూ అంది.

క్షణంసేపు శ్రీధర్‌కు లక్ష్మి చెబుతున్న దేమిటో అర్థం కానట్లు చూశాడు. మరుక్షణంలోనే అతనికళ్ళలో అపూర్వమైన కాంతి ఒకటి తళుక్కుమని మెరిసింది. పెదవులు మెల్లగా చిరునవ్వుతో విచ్చుకున్నాయి. "నిజంగా!" అన్నాడు నమ్మలేనట్లు.

టేబిల్‌వైపు వెళ్ళిపోతున్న లక్ష్మి తల అదోరకంగా పెట్టి, మొగం వాల్చి శ్రీధర్‌వైపు చూసింది-ఆ చూపులో అబద్ధం చెప్పవలసిన ఖర్మ నాకేమిటి? అన్న భావం స్పష్టంగా కన్పరుస్తూ. శ్రీధర్ పెదవులు కదిల్చి ఏదో చెప్పబోయాడు. ఈలోగా వెనక స్ప్రింగ్ తలుపు తెరుచుకుంది. లోపలినుంచి విజయ నెమ్మదిగా బయటికి వస్తున్నది. తలుపు తెరుచుకొని వస్తున్న విజయ క్షణంసేపు ఆగిపోయి భర్తవైపు చూసింది. శ్రీధర్ గూడా చూశాడు ఇద్దరి కన్నులు కలుసుకున్నాయి. విజయ కన్నులు ముందుగా క్రిందకు వాలిపోయినాయి.

టేబుల్ దగ్గరనుంచి ఇద్దరినీ గమనిస్తున్న లక్ష్మి, "ఫస్టు ప్రెగ్నెన్సీ కాబట్టి కొంచెం బలహీనంగా ఉంది. అదేం ఫరవాలేదు. కొద్దిగా చికిత్స తీసుకుంటే సర్దుకుంటుంది. టానిక్ వ్రాసియిస్తాను" అంది, ప్రిస్క్రిప్షన్ వ్రాయటానికి కాగితం తీసుకుంటూ.

శ్రీధర్ ఒకటికి రెండుసార్లు డాక్టరుకు కృతజ్ఞతచెప్పి బయటికి వచ్చాడు. పది నిమిషాల్లో ఇద్దరూ ఇంటికి చేరుకున్నారు.

దారి పొడుగునా విజయ మౌనంగా ఉండటంచూసి "అలాఉన్నావేం?" అని అడిగాడు శ్రీధర్.

"ఎలా వున్నాను?"

"ఎలాగో వున్నావు. నిన్ను యింత నిశ్శబ్దంగా యింతవరకూ ఎన్నడూ చూడలేదు."

శ్రీధర్ మాటలకు విజయ నవ్వి వూరుకుంది.

ఆ రాత్రి పడుకోబోతుండగా శ్రీధర్ విజయను దగ్గరకు తీసుకుంటూ "తల్లిని కాబోతున్నాననే సంతోషం నీకెలా ఉందో తెలియదు గాని నాకు మట్టుకు తండ్రిని కాబోతున్నానని మహాగర్వంగా ఉంది" అన్నాడు.

"అలాగేం?" అన్నట్లు చూసింది.

"నిజం. ఇదుగో అమ్మాయ్! ఇప్పుడే చెబుతున్నాను. ఇహ నుంచి తమకు కొన్ని ఆజ్ఞలు జారీచేయబడతాయి. అవి ఏమాత్రం జవదాటినట్లు కన్పించినా..." అంటూ చూపుడు వేలుతో తన గుండెలమీద పెట్టి చూపించుకుంటూ, "ఇహ వీడు నీకు తిండికి కూడా కనబడడు, తెలిసిందా?" అన్నాడు.

"అదుగో, అప్పుడే మొదలైందా? పిల్లలు పుట్టకముందే బెదిరించేస్తున్నారు; ఆతర్వాత ఇహ నా మొహమే చూడరులా ఉంది." పెదవులు ముడివేసుకుని బుంగమూతి పెట్టేసింది విజయ.

"అబ్బెబ్బే! అదేనా? నీకు పాపాయిలు పుట్టినా,నాకెప్పుడూ మొదటి పాపాయి నువ్వే. నీతర్వాతే పుట్టబోయేవాళ్ళు" మరింత దగ్గరగా లాక్కుంటూ అన్నాడు.

ఆ రాత్రి అలవాటుకు విరుద్ధంగా యెప్పుడూ మితభాషిగా వుండే శ్రీధర్ చాలా చాలా మాట్లాడాడు. ఏది కావలసినా తనను నిర్మొహమాటంగా అడగమన్నాడు. ఎంతయిన తను మగవాడు కాబట్టి, ఇంటిలో మరో ఆడదిక్కులేదు కాబట్టి, చాలా అవసరం అనీ, అర్జెంట్ అనీ ఆరాత్రే కూర్చుని పెత్తల్లి పేరిట రాజమండ్రి ఉత్తరం వ్రాశాడు.

మర్నాడు ఇంటినిండా అందంగా బొద్దుగావున్న చిన్నచిన్న పిల్లల కేలండర్లు తీసుకువచ్చి తగిలించాడు. అన్నింటిలోకి శ్రీధర్‌కు నచ్చింది చేతిలో యాపిల్ పండుతో, చంకలో పిల్లబొమ్మతో, గిరజాలజుట్టుతో ఉన్న ఐదారు సంవత్సరాల ఆడపిల్ల. ఆ కాలెండర్ తీసుకువచ్చి విజయ పడుకునే మంచానికి ఎదురుగుండా తగిలించాడు. విజయ కది నచ్చలేదు. ఇంకో కాలెండర్‌లో ఆడుకునే సామానంతా ప్రక్కన పారేసి క్రింద కూర్చుని చేయిచాచి చిన్న బిస్కట్ ముక్కను కుక్కపిల్లనోట్లో పెడుతూ, ఆ పెట్టడంలో యథాలాపంగా తనుగూడా సగం నోరు తెరిచి గుండ్రని మొహంతో బొద్దుగావున్న బాబు కాలెండర్ నచ్చింది. విజయ అది కావా లంది.

"అబ్బే! అది వద్దు. అది చూస్తే మగపిల్లవాడు పుడతాడు. నాకు ఆడపిల్ల కావాలి!" శ్రీధర్ తగాదా పెట్టుకున్నాడు.

"ఆడపిల్ల నాకక్కరలేదు. నాకు అదిగో, అచ్చం అలాటి బాబే కావాలి."

విజయ మొండిగా జవాబు చెప్పింది. ఇద్దరికీ మాటా మాటా పెరిగింది. ఇంకో సమయంలో అయితే శ్రీధర్ చచ్చినా పట్టువదిలేవాడు కాదు. కాని ఈ సమయం వేరు. విజయ మనసు నొప్పించకూడదు. రాజీకి వచ్చి రెండు కాలెండర్లూ ప్రక్క ప్రక్కన తగిలించాడు.

"నేను ఒక్క బాబువంకే చూస్తాను." చిలిపిగా అంది విజయ.

"అదుగో!" శ్రీధర్‌కు ఈసారి నిజంగానే కోపం వచ్చింది.

"సరేలెండి. ఏదో సామెత చెప్పినట్టుగా, పుట్టబోయే పిల్లకోసం, పెట్టబోయే పేరును గురించి తగాదా పడ్డట్టు-రెండింటినీ చూస్తాను-సరేనా?" నవ్వుతూ అంది విజయ.

"అలా దారికి రా బుద్ధిమంతురాలిగా!" శ్రీధర్ మొహం మళ్ళీ ప్రసన్నమైంది.

వారం రోజులకు శ్రీధర్ పంపిన రైలుఖర్చులు అందీ అందగానే తిరుగురైల్లోవచ్చి ఊడిపడింది పెద్దతల్లి. ఆవిడది మహాకాయం కూర్చున్న చోటునుంచి లేవలేదు. కంఠం మటుకు కంచుకంఠం. కూర్చున్నచోటు

నుంచి ఏవైవన్నా సరే మూడు మైళ్ళు విన్పిస్తుంది. అందుకని ఆవిడకు లేవలేనే అనే బాధలేదు.

ఆవిడ గుమ్మంలో కాలు పెడుతూనే "ఏమేపిల్లా! తల్లివి కాబోతు న్నావనే సంతోషమా ఏమిటి, చిక్కి సగం అయావు? తిండీ తిప్పలూ పూర్తిగా మానేశావా?" అంది.

విజయ తలవంచుకుని నవ్వేసింది. శ్రీధర్ పరీక్షగా విజయవైపు చూశాడు. అవును, మొఖంలో ఏదో మెరుపు వచ్చినట్లుంది గాని పరీక్షగా చూస్తే ఆమె చిక్కినట్లేవుంది. అది తన కంటికి అందనేలేదు. అందుకె ఇలాంటి విషయాల్లో ఆడవాళ్ళ ఆసరా కావాలంటారు - అనుకున్నాడు.

పెత్తల్లి రాకతో ఇంటికి కొత్తసందడి వచ్చింది. ఆవిడ లేచింది మొదలు పడుకోబోయేదాకా దేనికోదానికి గొంతు పెట్టుకుని అరుస్తూ ఉంటుంది. విజయకది చికాకనిపించినా భరించక తప్పటంలేదు. ఆరునూర యినా, అటు సూర్యుడు ఇటుపొడిచినా విజయ పురుడు వెడితేగాని శ్రీధర్ ఆవిడను పంపడు. అదిఖాయం. అంతకంటే చికాకయినవిషయం రోజుకో రకంగా గుట్టలు గుట్టలుగా ఆవిడచేస్తున్న పిండివంటలు! అవన్నీ తినలేక ఆమె తలప్రాణం తోక్కి వస్తున్నది. "నేను తినలేను బాబో!" అంటే ఆమె వెళ్ళి అతనికి చెబుతుంది అది అతనికి కోపం తెప్పిస్తుంది.

"లావు అవుతానని భయంకదూ?"కళ్ళలో చిరుకోపం కనబరుస్తూ అంటాడు అతడు.

"బాగుంది. అయేవాళ్ళు యెలాగూ అవుతారు. ప్రత్యేకించి అవి తినక్కరలేదు. సయించదు మొర్రో అంటే మీరు గూడా వినరేం" కళ్ళల్లో నీళ్ళు గిర్రున తిప్పుకుని అక్కడినుంచి లేచిపోతుంది విజయ.

"ఏమో, నాయనా! మధ్య నాకెందుకు, ఏదో లేవలేనిది కదా అని చేయటంగాని నాకు ఓపిక ఏడ్చిందా?" పెత్తల్లి వెళ్ళిపోయేది. ఇలాటి చిన్నచిన్న సంఘటనలతో తల్లిని కాబోతున్నాననే సంతోషం విజయలో త్వరలోనే చల్లారిపోయింది.

పిండివంటకంటే భయంకరమైనవి పైనుంచి పెద్దమ్మగారి జాతక కథలు బోలెడు. ఆవిడ పుట్టిన పదవయేటే పెళ్ళయింది. పెళ్ళి అయిన

పదో రోజునే భర్త మరణించాడు. అప్పటినుంచి ఇప్పటివరకూ ఆవిడ జీవితం అంతా వాళ్ళకూ, వీళ్ళకూ పురుళ్ళు పోయడంతోనే గడిచి పోయింది. అందుకని ఆవిడకు బోలెడు కథలు తెలుసు. అవిగాక విన్నవి యింకా ఉన్నాయి. అవన్నీ కలిసి రకరకాలుగా రోజుకో కథ విజయకు వర్ణించి చెబుతుండేది. ఆ చెప్పేదికూడా తల్లీ, పిల్లా సుఖంగా ఉన్నవ యితే బాగుండును. మనసుకుకాస్త ఆహ్లాదకరంగానన్నా ఉండేవి. ఊహు! అలాకాదు! వాళ్ళమేనత్త మనుమరాలు నెలలునిండి నడవలేకఎలా అవస్థ పడేదో, వాళ్ళపుట్టింట్లో యింటి ప్రక్కనున్న మునసబుగారమ్మాయి ప్రసవించలేక ఏ విధంగా యాతనపడిందో, వాళ్ళకు తెలిసిన వాళ్ళలో సరిగ్గా విజయలాగే వుండి అదే వయసులో నిండునెలలు వచ్చిం తర్వాత గుర్రంవాతం వచ్చి చచ్చిపోతే ఆపరేషన్ చేసి కడుపుకోసి పిల్లను యెలా బయటకు తీశారో — ఇలాంటివి బోలెడు! కాఫీచేస్తూనో, భోజనం పెడు తూనో, మధ్యాహ్నం శ్రీధర్ ఆఫీసుకు వెళ్ళినప్పుడో, వూరికే కూర్చున్న ప్పుడో ఆవిడ ఇలా వర్ణించి చెబుతుంటే విజయ కన్నులు పెద్దవిచేసుకొని చెవులు దొరపెట్టుకొని వొక్క అక్షరంకూడా పొల్లుపోకుండా వినేది. పాపం అలా చెప్పటంలో పెద్దమ్మగారికి వేరే వుద్దేశ్యం ఏమీలేదు. అలా బాధలు పడటానికి వాళ్ళవాళ్ళ నిర్లక్ష్యాలే కారణాలని,అలాంటి నిర్లక్ష్యాలు విజయను చేయవద్దనీ చెప్పేది. కాని కథ చివర ఉన్న నీతివాక్యాల్లా ఈ ఆఖరి మాటలు తీసుకోవలసిన జాగ్రత్తలు విజయకు వినిపించేవిగావు. ఆ కథలతోటే మతిపోయినంత పనయ్యేది.

ఆరోనెలరాగానే ఉత్కృష్టంగా వుంటుందని శ్రీధర్ గదిలో విజయకు విశాలంగానే వేరేప్రక్క ఏర్పాటు చేశాడు. రాత్రి మంచంమీద పడుకోగానే ఉదయం పెద్దమ్మగారుచెప్పిన కథల్లోనిమనుష్యులంతావరసగా విజయను పలకరించటానికి వచ్చేవారు. హడలిపోయిన విజయ కలత నిద్రలోలేచి వొంటరిగా పడుకోటానికి భయపడి శ్రీధర్ మంచం మీదకు వచ్చి మెల్లగా అతని ప్రక్కన చోటు చేసుకొని పడుకునేది ఏరాత్రి వేళో ఎందుకో మెలకువ వచ్చిన శ్రీధర్ లేచి చూస్తే ప్రక్కగా తన కెక్కడ మెలకువ వస్తుందో నన్నట్లు వొదిగి పడుకున్న విజయను చూస్తే జాలివేసేది. నిద్రలోవున్న విజయకు మెలకువ రాకుండానే సరిగా

పడుకునేలా చేసి జాగ్రత్తగా కప్పి తను లేచివచ్చి యివతల మంచం మీద పడుకునేవాడు.

నెలలు దగ్గర పడుతున్నకొద్దీ విజయకు తనకు తెలియకుండానే మనసులో ఏదో బెంగలాంటిది పట్టుకుంది. ఎలా ఈ గండం దాటడం? ఎప్పుడు బయటపడడం తను? అసలు బయటపడుతుందా అని! ఆడ దానికి ప్రసవించి మళ్ళీ మామూలుగా కావటం అనేది మరో జన్మే నంటారు. క్రమంగా విజయ ఆలోచనలు విపరీత మార్గాలు తొక్కటం మొదలు పెట్టాయి. తను ప్రసవించే రోజుకాదు, మృత్యు ముఖంలోకి వెళ్ళేరోజు దగ్గరకి వస్తున్నదని అనిపించేది.

ఒకరోజు రాత్రి శ్రీధర్ విజయ ఇద్దరూ భోజనంచేసి పైన వరం డాలో కూర్చున్నారు. తెల్లటి వెన్నెల చక్కగా వుంది. శ్రీధర్ కుర్చీలో జేరగిలబడి ఏదో ఆలోచిస్తున్నాడు.- పెద్దమ్మగారు పడుకోవటంవల్ల ఇల్లు నిశ్శబ్దంగా నిద్రపోతున్నట్టుంది.

"ఏమండీ, ఒకవేళ ప్రసవించలేక నేను చచ్చిపోతే?" అంది నెమ్మదిగా విజయ.

"ఛ! ఛ! ఏమిటా మాటలు? నువ్వు పుట్టలా? నేను పుట్టలేదూ? అందరూ ఇలా భయపడి హడలిపోతే ప్రపంచం యిలా పెరగగలిగేదా?" శ్రీధర్ లేచివచ్చి విజయ ప్రక్క సోఫాలో కూర్చున్నాడు.

"ఏమో? నాకెలాగో అనిపిస్తున్నది! ఇంకా ఎన్నాళ్ళో ఈ బరువు?" విజయ శ్రీధర్ ఒళ్ళో తల దాచుకుంటూ అంది.

"అయిపోయిందిగా! ఒక్కవారం రోజుల్లో పురుడు వస్తుందని డాక్టర్ లక్ష్మి చెప్పలేదూ? భయపడకు. ఏమీగాదు మనకు చక్కటిబాబు పుడతాడు. నీకు బాబే కావాలన్నావుగా? పేరేం పెడదాం చెప్పు? నేనవే ఆలోచిస్తున్నాను." ఆప్యాయంగా ఒళ్ళో ఉన్న విజయజుట్టు సవరిస్తూ అన్నాడు.

"మొన్నటిదాకా పాపకావాలని పోట్లాడి యివాళ బాబు అంటున్నా రేం?" నీరసంగా నవ్వింది విజయ.

"ఎవరయినా సరే. నీ నా రక్తం కలిసిపోయి, మన మనసులు

పెనవేసుకున్న రూపం; ఏదయితేనేం మన ప్రేమానురాగాలకి ప్రతి రూపం! "విజయ అలాగే కూర్చుండి పోయింది శ్రీధర్ మాటలు వింటూ.

డాక్టర్ లక్ష్మి చెప్పినదానికంటే నాలుగు రోజులు ముందుగానే పురుడు వచ్చేసింది. ఒకరోజు ఉదయం లేస్తూనే విజయ బద్ధకంగా వుందంది. ఆరోజల్లా ఎలాగో ఉంది. సాయంత్రం అయేసరికి మొహం వాడిపోయింది. రాత్రి సరిగా నిద్రపట్టలేదు. మర్నాడుగూడా అలాగే వుంది. శ్రీధర్ ఆఫీసుకు సెలవు పెట్టేశాడు. ఆ రోజు సాయంత్రానికి ఆస్పత్రికి వెళ్ళవలసి వచ్చింది.

"అప్పుడే కాదు. ఇంకా అయిదారు గంటలు టైముంది" అంది విజయను పరీక్షచేసి బయటకు వచ్చిన డాక్టర్.

"నే నుండవచ్చా అప్పటి వరకూ? ఫర్వాలేదా? అభ్యంతరం వుండదు గదా?" అడగలేక అడిగాడు శ్రీధర్.

తలెత్తి ఒకసారి మొహంలోకి పరీక్షగా చూసిన లక్ష్మి ఏమను కుందో ఏమో, సరేనని తల వూపి వెళ్ళిపోయింది.

నొప్పులు ప్రారంభమయినాయి. విజయకు తెలియని బాధ ఏదో నరాలను గుంజేస్తున్నది. మధ్య మధ్య తనకు తెలియకుండానే "అబ్బా! అబ్బా! అయ్యో!" అనేస్తున్నది. ఉన్నట్లుండి కెవ్వుమని "బాబో! చచ్చిపో తున్నాను. డాక్టరును రమ్మనండి" అంటున్నది. కాని యెవరూ వినిపించు కున్నట్లే లేదు. శ్రీధర్ మనసులో కంగారుపడినా బలవంతాన ధైర్యం తెచ్చుకుని కూర్చున్నాడు.

చూస్తుండగానే నాలుగు గంటలు గడిచిపోయినాయి. డాక్టర్ లక్ష్మి వచ్చి ఏదో ఇంజక్షన్ యిచ్చి మరో నర్సు సాయంతో విజయను లోపలి గదిలోకి తీసుకువెళ్ళి పోయింది.

బయట వరండాలో ఒంటరిగా నిశ్శబ్దంగా నిలబడిపోయాడు శ్రీధర్. అతనికోసం వేసిన కుర్చీలో కూర్చోవాలని గూడా అనిపించడం లేదు అతనికి. బయట వెన్నెల పిండార బోసినట్లుంది. ప్రశాంతంగా వున్న వాతావరణంలో వరండా ముందున్న పూలమొక్కలు "విజయ బాధను మేమూ గమనిస్తున్నాం" అన్నట్లుగా స్థాణువుల్లా నిల్చివున్నాయి.

ఇలాటి బాధలతో మనుష్యులు యాతన పడతారని తెలియని పక్షులేవో గూటిలో చేరి కువకువ మంటున్నాయి.

వరండాలో ఉన్న స్తంభాన్ని ఆనుకుని నిశ్చింతగా నిలబడిపోయి బయటకు చూస్తున్న శ్రీధర్‌కు లోపలనుంచి "నే నీ బాధ భరించలేను డాక్టర్! చచ్చిపోతాను" అని బిగ్గరగా అంటూ మధ్య మధ్య ఏడుస్తున్న కేకలు వినిపిస్తున్నాయి. వాటిలో భావం ఏదో చురకత్తిలా శ్రీధర్ హృదయంలోంచి దూసుకుపోయింది. నలుగురుండగా గట్టిగా నవ్వటానికి గాని, మాట్లాడటానికిగాని సిగ్గుపడే విజయ-ఎలాఅంటోందో బాధతో! స్పృహలేనట్లుంది. తనేం చేయగలడు? కనీసం తను దగ్గరగా వుంటేనైనా విజయకు ధైర్యంగా ఉంటుందేమో! ఏదో గుర్తు వచ్చిన వాడిలా శ్రీధర్ విజయను పడుకోబెట్టిన గదివైపు రెండడుగులు వేశాడు. ఇంతలో గ్లోవ్స్ తొడుకున్న లక్ష్మి ఏదో పనిమీద గబగబా బయటకు వచ్చింది.

"డాక్టర్! నేను లోపలకు రాగూడదా? విజయకు కాస్త ధైర్యం వస్తుందేమో!" గబగబా వెడుతున్న లక్ష్మి శ్రీధర్ మాటలతో చటుక్కున ఆగిపోయి వెనక్కు తిరిగిచూసింది. అదోకరంగా నవ్వి "ఎవరుండి ఎవరేం చేయగలరు? అసలుమీరు ఇంటికి వెళ్ళిపోవటం మంచిది. ఇక్కడుంటే అలాగే అనిపిస్తుంది" అని మళ్ళీ చకచకా వెళ్ళిపోయింది.

నిర్వన్నుడైన శ్రీధర్ మళ్ళీ స్తంభం దగ్గరకు వచ్చి నిలబడ్డాడు. ప్రపంచం ప్రశాంతత ఒడిలో హాయిగా నిద్రపోతున్నది. ఎవరికీ యే బాధాలేదు. తనకూ లేదు.కాని విజయ? భగవాన్! ఎంతో మధురమైన ఆ సమయాన్ని స్త్రీపురుషులిద్దరూ సమానంగా అనుభవిస్తారే!కాని యీ బాధ స్త్రీ ఒక్కదానికే ఎందుకిచ్చావు? ఇందులో పురుషుడికి కూడా భాగం ఎందుకు పెట్టరాదు? ఏం పాపం చేశారని వారికీశిక్ష? ఎంతో అందమైన అనుభూతి పొందిన ఆ సమయాలను ఓవిధంగా విజయకంటే తనే ఆనందించి అనుభవించాడేమో! ఆ అనుభవంలో విజయకు యిలాటి బాధ లభిస్తుందని తనకేం తెలుసు? అసలు ప్రసవవేదన యింత భయంకరం అనుకుంటే తను పిల్లలనే కోరుకునేవాడుకాదు. ఈ సమయంలో విజయకు తనేం చేయలేకపోతున్నాడెందువల్ల? అసలు సృష్టి రహస్యం ఇందులోనే వుందా? కనీసం తను విజయప్రక్కనైనా నిలబడితే తనకు

మనశ్శాంతిగా వుండేది. కాని డాక్టరులక్ష్మి వద్దంటున్నది. పైగా గట్టిగా మాట్లాడితే యింటికి వెళ్ళిపొమ్మని బయటకు గెంటుతుంది కూడ! తన బాధ ఆవిడకేంతెలుస్తుంది? శ్రీధర్‌కు లక్ష్మిమీద విరుచుకు తినాలన్నంత కోపం వచ్చింది. కాని ఏం చెయ్యలేక నిస్సహాయంగా నిమిషాలు లెక్క పెట్టుకుంటూ అక్కడే నిలబడిపోయాడు లోపల శిశువేమైనా సరే! విజయ సవ్యంగా బ్రతికి బయటపడితే అదేచాలు! భగవంతునికి లోపల్లోపల మనసారా మొక్కుకున్నాడు. తనకు తెలియకుండానే తను జీవితంలో మొదటిసారిగా భగవంతుడిని మనసార తలవటం గుర్తువచ్చేసరికి నవ్వు వచ్చింది. నిశ్శబ్దాన్ని చీల్చుకుంటూ విజయ స్వరం ఖంగు మంటున్నది.

"నా ప్రాణం పోకపోతే పోవటానికి ఏదయినా మందివ్వు డాక్టర్! నేనీ బాధ భరించలేను"

"హుష్! ఏమిటా అరుపులు. అందరూ నిద్రలేచి పరుగెత్తుకొచ్చేశారు" నెమ్మదిగా కసురుతున్నది లక్ష్మి.

"నా ప్రాణం పోతోంది అంటే వినరేం?" కోపంగా బాధతో పళ్ళు బిగపట్టి అంది విజయ.

"ఎక్కడికి పోతుంది? నీ ప్రాణానికి నా ప్రాణం అడ్డు. సరేనా? నువ్వు నరాలు బిగబట్టకు, మరింత బాధపడతావు."

"ఇప్పుడసలు పడనట్లు!" విజయ శరీరం బాధతో మెలికలు తిరుగుతున్నది.

మనసు కసితో కరకరమంటున్నది. తనకుతెలుసు. ఈ బాధలు భరించలేదని. కాని శ్రీధర్ తనను మోసం చేశాడు. తను చచ్చిపోతానని తెలిసే కావాలనే "ఎంకరేజ్" చేశాడు. తనుఏమైపోతేనేం? అతనికి కావలసింది పిల్లలు. తండ్రి నయాననే గర్వం. అది దొరికితే చాలు? ఛీ!మగవాడి కెంత స్వార్థం? అంత స్వార్థం మనసులో పెట్టుకుని పైపైన తీపి తీపి మాటలు, తనింత యమయాతనకు గురి అయ్యేటప్పుడు ఆ వెధవ పిల్లలు లేకపోతేనేం? అలాకాదు. ఆడదన్న తర్వాత చచ్చినట్లు పిల్లలను కనితీరవలసిందే! పెద్దమ్మగారు చెప్పినట్లు తను సవ్యంగా ప్రసవించలేకపోతే? ఒకవేళ వాతం కమ్ముకువస్తే? వస్తే యేమవుతుంది? ప్రాణం

పోతుంది! శ్రీధర్ వాళ్ళు ఒక్క ఏడుపు ఏడ్చి ఊరుకుంటారు. మర్నా టికి కట్టెల మధ్య నగ్నంగా శవాన్ని నొక్కిపట్టి కాల్చి బూడిద చేస్తారు. అదీ జీవితం అంటే! ఇదంతా శ్రీధర్‌కు తెలుసు, కాని తనకు చెప్ప లేదు. ఎన్నో విషయాలు తెలిసిన అతనికి యిది మటుకు యెందుకు తెలియదు? ఒక్కసారి పిలిచి "నువ్వుచేసిన మోసం కనుక్కున్నాను" అని మొఖంమీద చెప్పేస్తే? అవును-చెప్పాలి. అదుగో తనకు మత్తులాటిది ఏదో వస్తున్నది. ప్రాణం పోవటం అంటే అదేనేమో కళ్ళముందు వెలుగు మసకగా మారిపోతున్నది. చీకట్లు కమ్ముతున్నాయి.

ఒళ్ళంతా చెమటలతో తడిసిపోయిన విజయ మూలగడానికి కూడా ఓపికలేనట్లుగా అతి నీరసంగా "డాక్టర్! ఆయనేరీ?ఒక్కసారి పిలవండి, నా కేదో మత్తులాటిది వస్తోంది" అన్నది.

"భయపడకు. మత్తు వచ్చిందా? రానీ, మళ్ళీ మెలకువ వస్తుందిలే. ఆయనిక్కడకు రాకూడదు." కాళ్ళ దిగువన నిలబడి లక్ష్మి అంది.

"ఎక్కడమనిషి! డాక్టర్‌కాదు, రాక్షసి! దెయ్యం! చెబితే వినదేం?" విజయకు అంత నీరసంలోనూ ఒళ్ళుమండింది.

"ఎందుకు రాకూడదూ? నా విషయం తెలియనిదంటూ ఏముంది? పిలవండి. నేను చూడాలి, లేకపోతే నేనే పిలుస్తాను." లేవబోతున్న విజయను గబ గబా యిద్దరు వచ్చి బలవంతాన పడుకోబెట్టారు.

"నువ్వు బలే అసాధ్యురాలిలా ఉన్నావే? అంత ఆగకుండా ఉన్నావా? సిస్టర్! బయట నిలబడి వున్నారు; ఆయనను ఒక్క నిమిషం వచ్చి వెళ్ళమను" అంది లక్ష్మి.

ఆవిడెన్నో కేసులు చూసింది. కాని-ఇలాటి సంఘటన జన్మలో చూడలేదు. శ్రీధర్ వచ్చేముందు తెల్లటి దుప్పటి ఒకటి కప్పి, విజయ శరీరం అంతా శ్రీధర్‌కు కన్పించకుండా ఉండేలా జాగ్రత్తపడింది లక్ష్మి.

స్ప్రింగు తలుపు తెరుచుకుంది. విజయ తల తిప్పి చూసింది. వెనక వెంటనే మూసుకున్న తలుపుకు ఇవతలగా చెదిరిపోయిన జుట్టులో, అలసిపోయిన ముఖంతో, ఎప్పుడూ ఎంతో గంభీరంగా ఉండే శ్రీధర్

జాలి గొలిపే చూపులతో దీనంగా నిలబడి వున్నాడు. అతనిముఖం పాలి పోయినట్లు స్పష్టంగా తెలుస్తున్నది.

"దగ్గరికి-అలా తలవైపుకు రండి. ఆవిడ మీకేదో చెప్పాలిట!" విసురుగా అంది డాక్టరు లక్ష్మి. నర్సు నిశ్శబ్దంగా తన పని చూసు కుంటున్నది.

శ్రీధర్ మెల్లగా విజయ దగ్గరకు వచ్చాడు. "ఏమిటి విజయా?" కంఠం బొంగురుగావుంది. నీళ్ళు కళ్ళలోతిరిగాయి ఎన్నోఅడగాలి, ఎంత ఘాటుగానో అడగాలి అన్న విజయ మనసు శ్రీధర్‌ను అలా చూడగానే జాలితో మెత్తబడిపోయింది. తను పడుతున్న ఈ బాధకు ఏమీలేని నిస్సహాయ స్థితిలో వుండి అతనెంత నరకం చూస్తున్నాడో అతనిని చూస్తుంటే తెలుస్తూనే ఉంది. కాపురానికి వచ్చిన యిన్ని సంవత్సరాలలో అతని కళ్ళలో నీళ్ళు మొదటిసారిగా చూస్తున్న విజయకు మనసు కరిగి పోవటమేకాదు; అతనిని అంత అసహ్యంగా ఊహించుకున్నందుకు తన మీద తనకే కోపం వచ్చింది.

"ఏం కావాలి?" ఎక్కడో ఉన్నట్లు; ఈ లోకానికి సంబంధించ నట్లున్న విజయ చూపుల్లో చూపులు కలుపుతూ తన ఉనికిని గుర్తించ మన్నట్లుగా అడిగాడు అతడు.

"ఏంలేదు. ఊరికే పిలిచాను. మీరు వెళ్ళకండి." అప్పటికే నొప్పులు తెలియకుండా ఉండేందుకు డాక్టరిచ్చిన ఇంజెక్షన్‌తో కళ్ళు మూతలు పడుతున్న విజయ అస్పష్టంగా అంది.

"ఏమిటో చెబుతానన్నావు" అంది డాక్టరు లక్ష్మి.

"అవును. కాని నాకేం తెలియడంలేదు. అంతా మత్తుగా యెలాగో వుంది డాక్టర్!" అస్పష్టంగా అంది విజయ. అప్పటికే కళ్ళు పూర్తిగా మూతలు పడినాయి.

"మీరు వెళ్ళండి" అంది లక్ష్మి, స్థాణువులా నిలచి పోయిన శ్రీధర్‌ను చూస్తూ. చేసేదిలేక భగవంతుడిమీద భారంవదిలేసి బయటికి వచ్చాడు శ్రీధర్.

మరో పదిహేను నిమిషాల్లో "కేర్" మన్న ధ్వని విన్పించింది. విజయ కేకలు ఆగిపోయిన యి. పరధ్యాసగా నిలబడ్డ శ్రీధర్ ఉలిక్క-

పడ్డాడు. కంచుగంటలా నిశ్శబ్దంలోంచి పసిపిల్ల కంఠం ఖంగ్‌మంది. అనుకోకుండా అతని గుండె దడదడ లాడింది. అంతసేపూ అలా నిలబడటం, మానవ జీవితాన్ని గురించి అనుకోకుండా వచ్చిన వేదాంతపు టాలోచనలు అన్నీ ఎగిరిపోయినాయి. గబగబా రెండడుగులు గదివేపు వేశాడు.

"అ౯వయ్యా!" నీకోసం మీ అమ్మా, నాన్నా ఖంగారు పడిపోతున్నారు" లేడీ డాక్టర్ లక్ష్మి మాటలు గదినుంచి దూసుకునివచ్చి శ్రీధర్ చెవులను తాకాయి.

అయితే మగపిల్లవాడన్నమాట! ఇంతలో నర్సు బయటికి వచ్చి "మగపిల్లవాడు!" అంది. అతను ఒక్కక్షణం నర్సు మొహంలోకి చూసి ఆగమని, వెంటనే జేబులోకి చేయిపోనిచ్చి చేతికి వచ్చిన పది రూపాయల కాగితాన్ని తీసి నర్సుచేతిలోపెట్టి "థాంక్స్!" అన్నాడు. నిమిషం సేపు అనుకోని ఈసంఘటనకు తెల్లబోయిన నర్సు వెంటనే తమాయించుకుని, అతను ఇచ్చిన నోటును మడిచి జాకెట్‌లోపల దాచేసుకుని, మళ్ళీ యేమీ ఎరగనిదానిలా నిర్వికారంగా లోపలికి వెళ్ళిపోయింది.

అప్పటికి గుర్తువచ్చింది శ్రీధర్‌కు తను వచ్చినప్పటినుంచి నిలబడి వున్న సంగతి. వెళ్ళి తనకోసం వేసిన కుర్చీలో కూర్చున్నాడు. చకచకా పది నిమిషాలు గడిచి పోయినాయి.

"హమ్మయ్య, ఆవిడ ఖంగారు చూసి ఇంత తేలికగా తెములుతుందనుకోలేదు. మగపిల్లవాడు. మంచి ప్రెజెంటేషన్ యివ్వాలి మాకు." డాక్టర్ లక్ష్మి శ్రీధర్ దగ్గరగావచ్చి ప్రక్కనున్న కుర్చీలో కూర్చుంటూ అంది.

"తప్పకుండా, అంతా మీచేతి చలువ" అన్నాడు అతను కృతజ్ఞత నిండిన చూపులతో లేచి నిలబడుతూ.

"నాదేం వుందిలెండి? అయినా, ఆవిడకంటే మీ ఖంగారెక్కువై పోయింది." నవ్వుతూ అంది లక్ష్మి. శ్రీధర్ మొహం సిగ్గుతో క్రిందికి వాలింది.

"మొదట మీరు వస్తానంటే ఎందుకు వద్దన్నానో తెలుసా? ఒక్క డాక్టర్ల విషయం వదిలేస్తే మామూలుగా ప్రతిమగవాడికి స్త్రీనుంచి తనకు

లక్ష్యమైన వాటిల్లో ఓ విధమైన నూతనత్వం కన్పించాలి. భార్యను గురించి భర్తకెంత తెలిసినా, అసలెప్పటికీ తెలియనివి కొన్ని వుంటాయి; వాటిని గురించి మగవాళ్ళకి అందమైన భ్రమ ఒకటుంటుంది. ప్రసవ వేదనలాటి సమయంలో స్త్రీని చూస్తే మగవాడికి ఆ భ్రమ పోతుంది. అందుకే మిమ్మల్ని వద్దన్నాను. మగవాడికి అన్నిచోట్లకి రావడానికి అనుమతి యిచ్చే మగవాళ్ళు ఈ ఒక్క విషయంలో యెందుకు యివ్వ లేదో మీ కిప్పుడర్థమైందను కుంటాను."

బయట వెన్నెలపోయి అప్పుడే కన్పించనట్లు వస్తున్న తొలి వెలుగువంక చూస్తూ అంది లక్ష్మి. ఆమె మాటలు చాలా శ్రద్ధగావిన్నాడు అతను.

"రండి బాబుని చూద్దురుగాని!" శ్రీధర్‌ని వెంటబెట్టుకుని లోప లకు వెళ్ళింది లక్ష్మి.

అప్పటికే బాబుకు స్నానం చేయించి ఉయ్యాలలో పడుకోబెట్టింది నర్సు.

విజయకు అప్పుడే మెలకువ వస్తున్నది.

"వెళ్ళి ప్రక్కన-అదిగో ఆ స్టూలు లాక్కుని కూర్చోండి." లక్ష్మి ఆదేశించిన ప్రకారం స్టూలు ఒకటి లాక్కుని విజయ మంచం దగ్గరగా కూర్చున్నాడు. కాళ్ళనుంచి కంఠంవరకూ తెల్లటి దుప్పటి. ముఖం మటుకు ప్రక్కకు వంచి నిద్రపోతున్న దానిలా సొమ్మసిల్లినట్లు పడుకుని ఉంది విజయ. డాక్టరు లక్ష్మి సిరంజి తెచ్చి మరొక ఇంజక్షన్ యిచ్చింది. అప్పటికీ తెలివి వచ్చీ రానట్లుగా విజయ కళ్ళు తెరిచి మళ్ళీ మూసుకుంది.

శ్రీధర్ అలా కూర్చుని వుండగానే మరో పదిహేను నిమిషాలు గడిచి పోయినాయి. మళ్ళా ఒక గంటలో వస్తానని నర్సును ఉండమని చెప్పి డాక్టర్ వెళ్ళిపోయింది. విజయ కళ్ళువిప్పి చూసింది. ఎదురుగుండా శ్రీధర్ ఖంగారునిండిన కళ్ళతో మీదకువంగి "విజీ! మెలకువ వచ్చిందా?" అన్నాడు.

"ఊఁ!" అంది,

"హమ్మయ్య! బ్రతికే ఉన్నాను గదా!కలా, నిజమా?" తన చేతిని తీసుకున్న భర్త చేతుల స్పర్శకోసం తడుముతూ అంది.

"ఇలాచూడు, సరిగా నా వైపు." శ్రీధర్ విజయ చేతిని బుగ్గకు ఆనించుకుంటూ అన్నాడు.

విజయకు పూర్తిగా మెలకువ వచ్చేసింది.

"చాలా కష్టపడ్డావు సుమా! ఇదంతా నా మూలానే కదూ!" వంగి నుదురుమీదపడిన ముంగురులను సరిచేస్తూ అన్నాడు. అతనికంఠంలో ఆప్యాయత నిండుగా తొణికిస లాడుతున్నది.

"బాబా? పాపా?" నీరసంగా అడిగింది విజయ.

"బాబే! నర్స్!" అని కేకవేశాడు శ్రీధర్. బయట కుర్చీలో కునికి పాట్లు పడుతున్న నర్సు లేచి వచ్చింది.

"పిల్లాడిని చూపించు" అన్నాడు శ్రీధర్. అతని కంఠం మామూలుగా మారిపోయింది.

నర్సు జాగ్రత్తగా తెల్లటి బట్టలో చిన్ననోరుతో కళ్ళుమూసుకుని గుప్పెట్లు బిగబట్టి, నేనీ లోకంలోకి ఇప్పుడే వచ్చాను. బాగా అలిసిపోయాను కొంచెం నిద్రపోనివ్వండి-అన్నట్లు నిద్రపోతూన్నట్లున్న పిల్లాడిని తెచ్చి శ్రీధర్‌కు యిచ్చింది. శ్రీధర్ రెండు చేతులమధ్య అపురూపంగా పట్టుకున్న పిల్లాడిని విజయ వింతగా, భయంగా చూసింది.

"అంతా నీపోలికే! ఆ ముక్కు చూడు, గడ్డంమీద ఆ చిన్నసొట్ట యెంత స్పష్టంగా తెలుస్తోందో?" సగర్వంగా, తృప్తిగా పిల్లాడిని చూస్తూ అన్నాడు శ్రీధర్.

విజయ నీరసంగా నవ్వి ఊరుకుంది. నర్సు పిల్లాడిని తీసుకెళ్ళి ఉయ్యాలలో పడుకోబెట్టి బయటకు వెళ్ళిపోయింది.

"మొత్తానికి నువ్వే గెల్చావు. నా మాట వినలేదు కదూ?" నిష్ఠూరంగా అన్నాడు శ్రీధర్.

అలిసిపోయిన జయ కనులు మత్తుగా మెరిశాయి. చేయిచాచి భర్తచేతిని అందుకోవటానికి ప్రయత్నిస్తూ "ఈ సారి మీరు గెలుద్దురు గాని."

"అమ్మో! ఇంకానా? వద్దు వద్దు. నాకింకే పిల్లలు అక్కర్లేదు. ఇప్పటికి నువ్వుపడిన ఈ యాతన చాలు" అయిష్టంగా తల వూపాడు శ్రీధర్.

తెలిసో తెలియకో విజయను బాధకు గురిచేశాను. ఈ సారి మళ్ళా కలలోకూడా అలాటిది జరగనివ్వను. తనకు అంతగా ఆడపిల్లలమీద మోజు ఏర్పడితే ఎవర్నయినా పెంచుకోవచ్చు.

"బాధేంవుంది? ఆడపిల్ల మీకఖ్కర్లేకపోతే నాకు కావాలి."

"విజీ!"

"అవును. నాకు తెలియక ఏవేవో వూహించుకొని భయపడిపోయాను. మీచేతుల్లో బాబుని చూస్తుంటే నాకదంతా బాధే అనిపించడం లేదు. అయినా ఆ మాత్రం కష్టపడకపోతే యెలా?" విజయ మాటలకు శ్రీధర్‌కు నవ్వు వచ్చింది.

"సర్లే! నువ్వు కన్నులు మూసుకు పడుకో. రాత్రంతా నిద్రలేదు. బాగా రెస్టు తీసుకో!" విజయ తలమీద చేయివేసి నిమురుతూ అన్నాడు శ్రీధర్.

కిటికీలోంచి లోపలికి వస్తున్న వెలుగువంక చూస్తూ కనులుమూసుకొంది విజయ. శ్రీధర్‌కు మనసులోంచి కొండంత బరువు యెవరో దించినట్లు అనిపించింది.